క్లుప్తంగా

మురికి గుంతల్లో ఆయిల్‌బాల్స్


ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్‌లో ఖాళీ స్థలాల్లోని మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. గురువారం పొంచి ఉన్న వ్యాధులు అనే శీర్షిక సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ ప్రత్యేకాధికారి సత్యనంద్ ఆధ్వర్యంలో సిబ్బందితో ఆయిల్ బాల్స్ వేయించారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్ సభ్యుడిగా రాజవర్ధన్

ఆదిలాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్ గౌరవ సభ్యుడిగా జిల్లా కేంద్రాని కి చెందిన కవి, చిత్రకా రు డు సామల రాజవర్ధన్ ని య మితులయ్యారు. ఈ మేరకు పరిషత్ ప్రధాన కా ర్యదర్శి డాక్టర్. చెన్నయ్య నియామక పత్రం అందజేశారు. అదేవిధంగా చిత్రకారుడుగా, రేడియో వ్యాఖ్యతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

బోథ్: మండలం కౌఠ(బి) గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 20 లక్షలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్‌లను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

తోయగూడలో వైద్యశిబిరం

ఇంద్రవెల్లి: మండలంలోని గిన్నెర గ్రామపంచాయతీ పరిధిలోని తోయగూడలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. టైఫాయిడ్, మలేరియా, డెంగు, చికెన్‌గునియా వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పవార్ సురేశ్, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, స్టాఫ్ నర్స్ దివ్య, ఏఎన్‌ఎం పద్మ, సముద్ర పాల్గొన్నారు.

23న ధ్యాన మందిర వార్షికోత్సవం

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో ఈ నెల 23న పూలాజీబాబా ధ్యాన మందిర 25వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటకు ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్‌రావు ఇంగ్లే, వామన్‌రావు ఇంగ్లే వారిచే సామూహిక ధ్యానధారణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి

బోథ్: యాసంగి సీజన్‌కు రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. అధిక దిగుబడి సాధించాలంటే విత్తనాల నాణ్యత చాలా ముఖ్యమన్నారు. తెలంగాణ సీడ్స్ సంస్థ స్థానికంగా ఉన్న సీడ్స్ డీలర్లకు శనగ విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సీడ్స్ ఆఫీసర్ మహేశ్, కత్తూరి శ్రీకాంత్, కత్తూరి సంతోష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను గురువారం ఆర్టీసీ డిప్యూటీ ఈఈ అంజనేయలు పరిశీలించారు. బస్టాండ్‌లో బస్సులు రాకపోకలు, ప్లాట్‌ఫాం నిర్మాణం, బస్టాండ్ ఆవరణలో సీసీ పనులు చేసేందుకు కొలతలు తీసుకున్నారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు అందచేయనున్నట్లు తెలిపారు.

బెంచీలు, కుర్చీల పంపిణీ

నార్నూర్: డీహెచ్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని గంగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బెంచీలు, కుర్చీలను ట్రస్ట్ వ్యవస్థాపకుడు డిగాంబర్ హరీశ్ రాథోడ్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పవార్ అనిత, జాదవ్ రెడ్డినాయక్, బానోత్ గజానంద్ నాయక్, రాథోడ్ రమేశ్ పాల్గొన్నారు.

'పొలాల' పండుగకు వేళాయె

- తాంసిలో అధికారికంగా నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జోరుగా అలంకరణ సామగ్రి కొనుగోలు


తాంసిలో పొలాల పండుగకు పూర్తయిన ఏర్పాట్లు

తాంసి: ఆదిలాబాద్ జిల్లాలో పొలాల అమావాస్య పండుగ ప్రత్యేకమైనది. తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రతీఏటా కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఊరంతా కుల మత భేదం లేకుండా రైతులు, గ్రామస్తులు ఐక్యంగా ఉండి ఎడ్లను అందంగా అలకరించి పండుగను జరుపుకుంటారు. డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా హనుమాన్, పోచమ్మ ఆలయాల వద్దకు ఎద్దులను చేర్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఎడ్లను ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించి ఆడబిడ్డలు ఇంటి లోపలికి బసవన్నలను హారతి పట్టి స్వాగతం పలుకుతారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను బసవన్నలకు సమర్పిస్తారు.

రేపు తాంసిలో అధికారికంగా..

రైతుల, బసవన్నలకు మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీకగా పొలాల అమావాస్య పండుగ జరుపుకుంటారు. ఈ ఏడాది తాంసి మండల కేంద్రంలో 23న శనివారం అధికారికంగా పొలాల పండుగను నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ రాజర్షి షా, ఉన్నతాధికారులతో కలిసి మండల కేంద్రాన్ని సందర్శించి పండుగ నిర్వహణ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటికే గ్రామస్తులు ప్రజాప్రతినిధులతో పాటు, అధికారులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. పొలాల పండుగకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు వస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పండుగకు గుర్తింపు



రైతులు ప్రతీ సంవత్సరం పొలాల అమావాస్య పండుగ నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయిలో మరింత గుర్తింపు తీసుకొచ్చే విధంగా పొలాల పండుగ తాంసిలో నిర్వహిస్తున్నాం. ధ్వని ఫౌండేషన్ ద్వారా కలెక్టర్ రాజర్షి షా, అధికారుల సహకారంతో పొలాల పండుగ(ఎడ్ల జాతర)ను నిర్వహించనున్నాం.

– ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, క్యూరేటర్ ఆద్య కళా మ్యూజియం

గ్రామాన్ని ఎంపిక చేయడం సంతోషం



పొలాల పండుగను అధికారికంగా నిర్వహించడం కోసం మా గ్రామాన్ని ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. గ్రామస్తుల సహకారంతో పొలాల పండుగ కోసం ఇప్పటికే అధికారులకు సహకరించి ఏర్పాట్లు చేశాం. విజయవంతం చేయాలని గ్రామస్తుల తరఫున అందిరికీ ఆహ్వానం అందించాం.

– పి.కృష్ణ కుమార్, మాజీ సర్పంచ్, తాంసి

అర్హులందరికీ కల్యాణలక్ష్మి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

జైనథ్: అర్హులందరికీ కల్యాణలక్ష్మి చెక్కులు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక సంఘ భవనంలో గురువారం జైనథ్, సాత్నాల, బేల మండలాలకు సంబంధించిన 41 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. సమన్వయంతో పని చేస్తూ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అల్లూరి అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రూకేష్ రెడ్డి, తహసీల్దార్లు ఆత్రం నారాయణ, రామారావు, రఘునాథ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేరడిగొండలో పైలట్ ప్రాజెక్ట్ ప్రజావాణి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

నేరడిగొండ: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం పైలట్ ప్రాజెక్ట్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి హాజరయ్యారు. అధికారులు ప్రజల నుంచి మొత్తం 117 దరఖాస్తులు స్వీకరించగా.. అందులో 19 కొత్త వినతులు నమోదయ్యాయి. 61 ఫిర్యాదులను పరిశీలించి 32 సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలినవి సంబంధిత శాఖల పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలస్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిని పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలకు అక్కడే పరిష్కారించారు. మండలంలో ఆధార్ సెంటర్ పునరుద్ధరించాలని పలువురు దరఖాస్తులు చేశారు. వర్షాలకు స్తంభాలు దెబ్బతిన్నాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సలోని ఛాబ్రా, డీసీవో మోహన్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్యాం సుందర్, ఏవో ఎండీ సాద్, ఎంపీవో మహేదర్‌రెడ్డి, ఏఈలు శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

బోథ్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) నరేందర్ రాథోడ్, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్ గురువారం సొనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. గుట్టపక్క తండా, గుర్రాల తండా గ్రామాల్లో శానిటేషన్ పనులను పరిశీలించి, ఫీల్డ్ సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఆర్ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలన్నారు. వైద్య సిబ్బంది నవీన్‌రెడ్డి, కవిత, లింగారెడ్డి, యశోద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు ముడుగు శామ్యూల్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుంర శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిరంతరం పోరాడుతుందన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వీరయ్య, రాథోడ్ రవిత, అక్కల రవి చందర్ గౌడ్, దేవిదాస్ చౌహాన్, చంద్రబాన్ పాల్గొన్నారు.

తలమడుగు: పాత సీపీఎస్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ.. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వినోద్ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఎంఈవో వెంకట్‌రావు, శ్రీనివాస్ స్వామి, శంకర్, మురళీధర్, సంతోష్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఇంద్రవెల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియువత జరుపుకోవాలని ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ముందస్తుగా వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కోసం అనుమతులు తీసుకోవాలన్నారు. డీజే సౌండ్‌కు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాయన్న, సభ్యులు పాల్గొన్నారు.

హీరాసుక్క చిత్రపటం ప్రతీ ఇంట్లో ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కులదైవం ప్రతిమ, చిత్రపటం ప్రతీ ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఇంట్లో ఉండాలని ఆదివాసీ పర్ధాన్ జనజాతి ఉద్ధాన్ సంఘటన్ జాతీయ ఉపాధ్యాక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరాసుక్క దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు చేసి హీరాసుక్క చిత్రపటాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గేడం లక్ష్మణ్, పాండురంగ్, కుర్సెంగే యాదవ్ రావు, కుర్సెంగే తానాజీ, గేడం సాంబాజీ, గేడం మనోహర్, సెడ్మకి సుభాష్, వనిత, గేడం గీత, అనుసూయ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గణేష్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు పరిశీలించారు. కళాశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు.

రైతులకు సాగునీరు అందించాలి

తాంసి: మత్తడివాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్ అన్నారు. గురువారం మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టును సందర్శించారు. కుడికాలువ నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లు అవుతున్నా ఇప్పటివరకు సాగునీరు అందడం లేదన్నారు. కార్యక్రమంలో దత్తాత్రి, లంకా రాఘవులు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సాత్నాల: కొరటా చనక ప్రాజెక్ట్ ఒక ఎకరానికి కూడా సాగునీరు అందించలేకపోయిందని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్ అన్నారు. భోరజ్ మండలం కొరట ప్రాజెక్టును పరిశీలించారు. 2015 సంవత్సరంలో ప్రారంభించిన పనులు నేటికీ పూర్తికాలేదన్నారు. పిప్పల కోటి ఎత్తిపోతల పథకం పనులు, హత్తిఘాట్ పంప్ హౌస్ పనులు ఆదిలోనే ఆగిపోయాయన్నారు.

రైతులకు పరిహారం అందించాలి


దెబ్బతిన్న సోయాను పరిశీలిస్తున్న జోగు రామన్న

జైనథ్: మండలంలోని బహదూర్పూర్, కారింజ, గ్రామాలతో పాటు బేల మండలంలోని సంగడి, బెదోడ గ్రామంలో దెబ్బతిన్న పంటలను మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న గురువారం పరిశీలించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు తుతూమంత్రంగా జిల్లాకు వచ్చి వెళ్లారని, రైతుల పరిస్థితులు పట్టించుకోకుండా నిర్మల్ జిల్లాలోని టూరిజం చూడడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. రైతులకు పరిహారంగా రూ. 25 వేలు ఇవ్వాలన్నారు. పకడ్బందీగా అధికారులతో సర్వే చేయించి రైతులకు న్యాయం చేయాలన్నారు. నాయకులు మారిశెట్టి గోవర్ధన్, సర్పన్ లింగారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

బోథ్: సొనాల మండలంలో పంటలు దెబ్బతిన్నాయని, పంట బీమా లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని బీజేపీ నాయకులు అన్నారు. రైతులకు పరిహారం ఇవ్వాలని గురువారం తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు బోరే రవీందర్, జీవీ రమణ, కదం ప్రశాంత్, శుభాశ్ సూర్య, షేకన్న, రాజేశ్వర్, గులాబ్ సింగ్, రాజేశ్వర్ రెడ్డి, దిగోడే విష్ణు, బండారి మురళి పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి


వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: వర్షాకాలంలో అనారోగ్యం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ సుభాష్ అన్నారు. గురువారం మండలంలోని వాన్‌వాట్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ఇందుబాయి, ప్రేమ్‌సింగ్, ఆశ మిత్ర ఉన్నారు.

నేరడిగొండ: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కుమారి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పీజీ హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, గంగాసింగ్, వెంకట రమణ, సరిత పాల్గొన్నారు.

మొక్కలు బాధ్యతతో పెంచాలి


మొక్కలు నాటుతున్న నాయకులు

బోథ్: తెలంగాణ అటవీశాఖ చేపట్టిన 'హరిత నిధి అవెన్యూ ప్లాంటేషన్' కార్యక్రమంలో భాగంగా జీడిపల్లి నుంచి టీవీటీ వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు గాజుల పోతన్న, బత్తుల రమేశ్ పాల్గొని మొక్కలు నాటారు. హరిత తెలంగాణ లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. ఎఫ్ఆర్‌వో ప్రణయ్, ఎఫ్ఎస్‌వో ముంతాజ్, ఎఫ్‌బీవో రాధేశ్యామ్, శ్రీధర్, శంభు పాల్గొన్నారు.


గేర్జం వద్ద కోతకు గురైన కల్వర్టు

అదుపు తప్పితే అంతే..!

ఇచ్చోడ: మండలంలోని గేర్జం వద్ద కల్వర్టు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు గుండా నిత్యం 50 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

బేల: విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని ఆదిలాబాద్ డివిజన్ ఏడీఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ నిర్వహణ, ఆపరేటర్ విధులు, లాగ్‌బుక్, తదితర అంశాలపై ఆరా తీశారు. భారీ వర్షాలతో బేల నుంచి మశాల(బి) గ్రామానికి వెళ్లే 11కేవీ లైన్‌లో 3 ఇన్సులేటర్‌లు పూర్తిగా దెబ్బ తినడంతో సమస్యలు తలెత్తినట్లు గుర్తించామన్నారు. సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని ఏఈ సంతోష్‌కు సూచించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, లైన్‌మెన్ మహేశ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి నగేశ్‌రెడ్డి గురువారం మండలంలోని పిప్పల్‌ధరి శివారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సర్వే చేసి ప్రభుత్వానికి నివేదక అందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఏఈవో శివ చరణ్, రైతులు ఉన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

తలమడుగు: పత్తి పంటలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ గోపాల్ వర్మ అన్నారు. గురువారం మండలంలోని పల్సి (కె), కుచులాపూర్, లక్ష్మీపూర్, గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. ఎప్పటికప్పుడు నీటిని బయటకు తీసివేయాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రఘువీర్, శివచరణ్, సురేశ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలో పంట నష్టం సర్వే కొనసాగుతోంది. గురువారం మండలంలోని కోకస్‌మన్నూర్, ముఖరా(బి) గ్రామాల్లో ఏఈవో సుప్రియ పంటలను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

వంతెనకు మరమ్మతులు

బోథ్: సొనాల మండల కేంద్రం నుంచి చింతల్‌బోరి గ్రామానికి వెళ్లే దారిలో ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన దెబ్బతింది. దీంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ యువ నాయకులు ప్రదీప్ రాథోడ్ జేసీబీ సాయంతో మరమ్మతులు చేయించారు.

ఘనంగా వార్షికోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రం 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ట్రస్ట్ సభ్యులు, దాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్యాణ్‌రెడ్డి, దీపక్ పుష్కర్, మానిష్ రెడ్డి, విలాస్, ట్రస్ట్ సభ్యులు విజయ్‌బాబు పాల్గొన్నారు.

బీమా లేదు.. ధీమా లేదు

ఆదిలాబాద్‌టౌన్: రైతులు పండించిన పంటకు బీమా లేదని, దీంతో రైతులకు ధీమా లేకుండా పోయిందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు 30వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, 2020 నుంచి ఫసల్ బీమా యోజన పథకం అమలవడం లేదన్నారు.

పరామర్శ

బోథ్: సొనాల మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సొనాల, పార్డి కె, చింతలబోరి, ఫూల్‌సింగ్ నాయక్‌తండాలోని పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రమదానం

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ పరిధిలోని కేస్లాగూడ(జి) గ్రామంలో గురువారం యువకులు శ్రమదానం చేశారు. అంతర్గత రోడ్లతో పాటు ఆర్ అండ్‌బీ రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించారు.

నాణ్యమైన విద్యాబోధనపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న పెందుర్ సంతోష్

నార్నూర్: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ సంతోష్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని పున్నాగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో పోషకుల సమావేశం నిర్వహించారు. విద్యతోనే విద్యార్థుల భవిష్యత్ ఉందని, పిల్లలను పాఠశాలలకు సరైన సమయానికి పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ పెందూరు రమేశ్, కుడుమేత భీంరావ్, కేసోరావ్, లచ్చు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.